


RNI NO. 2011/39006

# పబ్లిక్ టుడే

దిన పత్రిక జనం కోసం

చిత్తూరు/తిరుపతి

సంపుటి : 2 సంచిక : 216 శనివారం 09, ఆగస్టు 2025

పబ్లిషర్ : రాజారెడ్డి - కసవనూరు, వెదురుకుప్పం మండలం, చిత్తూరు జిల్లా


### శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో..

# శాస్త్రోక్తంగా వరలక్ష్మీ వ్రతం..!



### విశేషంగా ఆకట్టుకున్న అష్టలక్ష్మీ మండపం

**తిరుచానూరు, ఆగస్టు 8, పబ్లిక్‌టుడే**

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ ఆస్థాన మండపంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం వైభవంగా జరిగింది. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా వేకువజామున అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి సహస్రనామార్చన, నిత్యార్చన, మూలవర్లకు, ఉత్సవర్లకు అభిషేకం నిర్వహిం చారు. ఈ పర్వదినాన అమ్మవారు బంగారు చీరతో విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం శ్రీ పద్మావతీ అమ్మవారి ఉత్సవమూర్తిని ఆస్థాన మండపానికి వేంచేపు చేసి పద్మపీఠంపై ఆశీనులను చేశారు. అక్కడ విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కలశస్థాపన, అమ్మవారి ఆరాధన, అంగపూజ, లక్ష్మీ సహస్రనామార్చన, అష్టోతర శత నామావళి నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని రోజా, చామంతి, మల్లె, సంపంగి, తులసి, పన్నీరు ఆకు, మరువము, తామరపూలు, వృక్షి వంటి సాంప్రదాయ పుష్పాలతో అమ్మవారిని ఆరాధించారు. ఈ సందర్భంగా అమ్మవారిని 9 గ్రంథులతో (నూలుపోగు) అలంకరించారు. ఒక్కో గ్రంథిని ఒక్కో దేవతకు గుర్తుగా ఆరాధించారు. భవిష్యోత్తర పురాణంలో వ్యాస భగవానుడు వరలక్ష్మీ వ్రతం పూజా విధానాన్ని, మహత్యాన్ని తెలియ జేశారని ఆలయ అర్చకులు శ్రీనివాస ఆచార్యులు తెలిపారు. పూర్వం శంకరుడు పార్వతిదేవికి ఈ వరలక్ష్మీ వ్రతం విశిష్ఠత, ఆచరించవలసిన విధానాన్ని తెలియ చేసినట్లు పురాణాల ద్వారా తెలుస్తోందన్నారు. త్రేతాయుగంలో కుండలినీ నగరంలో నివసించిన చారుమతి

- మిగతా 2లో..

### ఆహార భద్రత అధికారుల

# వరుస దాడులు !

❖ రేణిగుంటలో పలు కేసులు ❖ చెడిపోయిన ఆహారం ధ్వంసం



**రేణిగుంట, పబ్లిక్ టుడే:** మూడు రోజులుగా తిరుపతి, పరిసర ప్రాంతాలలో హెూటళ్లు, బేకరీలపై ఆహార భద్రత అధికారులు వరుస దాడులు చేస్తున్నారు. శుక్రవారం స్వీట్స్ అండ్ బేకరీలపై పై జాయింట్ కంట్రోలర్, లీగల్ మెట్రాలజీ అధికారులు దాడులు నిర్వహించారు. 17 బృందాలుగా ఏర్పాటు చేసి 35 వివిధ రకాల స్వీట్స్, బేకరీస్ దుకాణాలలో తనిఖీలు చేసారు. ఈ తనిఖీల్లో భాగంగా 31 ఆహార పదార్ధాలను శాంపుల్స్ సేకరించి విశ్లేషణ నిమిత్తం ల్యాబ్ కు పంపారు. ఎఫ్ఎస్ఎస్ఐ లైసెన్స్ నిబంధన ఉల్లంఘించి, పరిశుభ్రత పాటించని రేణిగుంటలోని ఎష్బి ఫుడ్ ఫైనాన్స్ బేకరీ ఫుడ్స్ కి

- మిగతా 3లో..

### విద్యార్థులకు అన్ని సౌకర్యాలు

# కల్పిస్తున్నాం

❖ పేద విద్యార్థులు అభివృద్ధే చంద్రబాబు లక్ష్యం

❖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి

**తిరుపతి, ఆగస్టు 08, పబ్లిక్ టుడే**



విద్యార్థుల విద్య, ఆరోగ్యం, భద్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం నాడు తిరుపతిలోని చెన్నారెడ్డి కాలనీలో ఎస్సి బాలికల సంక్షేమ వసతి గృహంలో మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహములోని వంటగది, మరుగుదొడ్లు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి సమస్యలు అడిగి

- మిగతా 3లో..

## శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో..

# శాస్త్రోక్తంగా వరలక్ష్మీ వ్రతం



(మొదటిపేజీ తరువాయి)

అనే భక్తురాలు వరలక్ష్మీ నోము ఆచరించి పొందిన ఫల ప్రదాన్ని ఈ సందర్భంగా వివరించారు. సాక్షాత్తు శ్రీ మహాలక్ష్మి ప్రీతితో తిరుచానూరులో శ్రీ పద్మావతీ అమ్మవారు అవతరించారని, వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలకు సత్సంతానం, దీర్ఘమాంగల్య సౌఖ్యం, సిరిసంపదలు, ఆరోగ్యం, కుటుంబ సౌఖ్యం వంటి ఎన్నో మహాఫలాలు కలుగుతాయని పురాణాల ద్వారా తెలుస్తోందన్నారు. తర్వాత 12 రకాల వివిధ నైవేద్యాలను అమ్మవారికి నివేదించారు. అనంతరం మహా మంగళ హారతితో వరలక్ష్మీ వ్రతం ముగిసింది. ఈ సందర్భంగా టిటిడి ఈవో జె.శ్యామల రావు మీడియాతో మాట్లాడుతూ, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని అత్యంత వైభవంగా నిర్వహించినట్లు చెప్పారు. ఆలయానికి వచ్చిన ప్రతి భక్తుడికి అమ్మవారి ప్రసాదాలు అందించేలా చర్యలు చేపట్టామన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో వ్రతంలో పాల్గొన్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక క్యూలైన్లు, అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ, తదితర ఏర్పాట్లు చేశామన్నారు. వరలక్ష్మీ వ్రతాన్ని భక్తులు వీక్షించేలా ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారాలు అందించామన్నారు. ఈ సందర్భంగా ఏపీ, తెలంగాణ వ్యాప్తంగా టిటిడికి చెందిన 52 ఆలయాల్లో 8 లక్షల గాజులు, 1.60 లక్షల కంకణాలు, 1.60 లక్షల పసుపు దారాలు, 1.60 లక్షల కుంకుమ ప్యాకెట్లు, లక్ష్మీ అష్టోత్తర శతనామావళి పుస్తక ప్రసాదాలను అందించామన్నారు.

### భక్తులను విశేషంగా అకట్టుకున్న వ్రత మండపం

టిటిడి ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఆస్థాన మండపంలో ఏర్పాటు చేసిన వ్రత మండపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. 40 మంది సిబ్బంది, 3 టన్నుల సంప్రదాయ పుష్పాలు, ఆరు రకాల 30 వేల కట్ ఫ్లవర్స్ తో మూడు రోజుల పాటు శ్రమించి అమ్మవారి ఆలయం, ఆస్థాన మండపం, వ్రత మండపాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. బత్తాయి, ఆపిల్ వంటి ఫలాలు, వివిధ సంప్రదాయ పుష్పాలతో వ్రత మండపాన్ని అద్భుతంగా రూపొందించారు. మండపం పైభాగంలో గజ లక్ష్మీ అమ్మవారు, కింది భాగంలో రెండు వైపుల ఐరావతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆస్థాన మండపాన్ని అష్టలక్ష్మి మూర్తులతో, రోజాలు, తామరపూలు లాంటి రంగురంగుల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. చెన్నైకి చెందిన దాత విరాళంతో పుష్పాలంకరణ చేపట్టామని ఉద్యానవన విభాగం డెప్యూటీ డైరెక్టర్ శ్రీ శ్రీనివాసులు తెలిపారు. భక్తులందరూ వ్రతాన్ని వీక్షించేందుకు వీలుగా ఆస్థాన మండపంలో, పుష్కరిణి వద్ద, వాహన మండపం వద్ద, ఫ్రైడే గార్డెన్స్, తొలప్ప గార్డెన్ వద్ద కలిపి 5 ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరి, టిటిడి బోర్డు సభ్యులు శ్రీమతి పనబాక లక్ష్మీ, జి.భానుప్రకాశ్ రెడ్డి, టిటిడి ఎక్స్ అఫిషియో మెంబర్ దివాకర్ రెడ్డి, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, ఆలయ డెప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, ఏఈఓ దేవరాజులు, ఆలయ అర్చకులు బాబుస్వామి, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.











# వెనుకబడిన వర్గాల అభ్యున్నతే తెలుగుదేశం పార్టీ లక్ష్యం

## - మాజీ శాసనమండలి సభ్యులు గౌనివారి శ్రీనివాసులు



**శాంతిపురం, పబ్లిక్ టుడే:** రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతే తెలుగుదేశం పార్టీ లక్ష్యం అని మాజీ శాసనమండలి సభ్యులు, మాజీ టీటీడీ బోర్డు సభ్యులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గౌని వారి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో వెనుకబడిన వర్గాల వారి కోసం కూటమి ప్రభుత్వం ద్వారా ఎన్నో కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతున్నది అన్నారు. రాష్ట్రంలోని దేవాలయాలలో పనిచేసే నాయి బ్రాహ్మణులకు వేతనాలను 25వేల రూపాయలకు పెంచడం జరిగిందన్నారు. సెలూన్లకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందివ్వడం జరుగుతుందన్నారు. చేనేతలకు 200 యూనిట్ల నుండి 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని గీత కార్మికులకు మద్యం షాపులలో బార్లలో 10 శాతం కేటాయింపు జరుగుతున్నదని అన్నారు. మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసే 217 జీవోను రద్దు చేయడం జరిగిందన్నారు, మోసకారులకు వేట నిషేధ సమయంలో 20వేల రూపాయలు ఆర్థిక సాయం అందివ్వడం జరుగుతుందన్నారు. బీసీల అభివృద్ధి కోసం ఎన్నో ఎన్నెన్నో పథకాలను చేపట్టడం జరిగిందన్నారు. సోలార్ విద్యుదీకరణలో బీసీలకు మూడు కిలోవాట్లకు 98 వేల రూపాయలను సబ్సిడీగా ఇవ్వడం జరుగుతున్నదన్నారు. బీసీల గృహ నిర్మాణానికి అదనంగా 50 వేల రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు. బీసీల రక్షణ చట్టం కొరకు కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ల కొరకు అసెంబ్లీలో తీర్మానం చేయడం జరిగిందన్నారు. అర్హులైన అందరికీ నెలనెలా 4వేల రూపాయలు పింఛను ఇవ్వడం జరుగుతున్నది అన్నారు. పదవుల లో సైతం బీసీలకు పెద్దపీట వేయడం జరుగుతున్నదన్నారు. రాష్ట్రంలో బీసీల సంక్షేమానికి, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తూ ఉంది అన్నారు.



### ఆహార భద్రత అధికారుల

## వరుస దాడులు !

(మొదటిపేజీ తరువాయి)

నోటీసు ఇచ్చి సీజ్ చేశారు. అలాగే టూటీ ఫ్రూటీ తయారీపై పరిశుభ్రత లేని కారణంగా కేసు నమోదు చేశారు. ఈ తనిఖీలలో భాగంగా సుమారు 75 కేజీలు ఎక్స్పైరీ మరియు పాడైన ఆహార పదార్థాలను సీజ్ చేసి ధ్వంసం చేసారు. ఆహార నమూనా పరీక్ష ఫలితాలు వచ్చిన వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టబడును ఈ తనిఖీలలో వివిధ జిల్లాల ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అధికారులు ఆహార భద్రత కల్తీ నిరోధక అధికారులు లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తిరుపతి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జీ వెంకటేశ్వరరావు, స్టేట్ జాయింట్ ఫుడ్ కంట్రోలర్ అండ్ పూర్ణచంద్రరావు తెలిపారు.



# స్వర్ణరథంపై శ్రీపద్మావతి అమ్మవారి కటాక్షం

**తిరుచానూరు, పబ్లిక్ టుడే:** తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శుక్రవారం స్వర్ణరథంపై ఆశీనులై భక్తులను కటాక్షించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తన్మయత్వంతో నాలుగుమాడ వీధుల్లో రథాన్ని లాగారు. కర్పూర హారతులు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. స్వర్ణరథోత్సవంలో ఈవో జె. శ్యామల రావు దంపతులు, జేఈవో వి వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో హరీంధ్రనాథ్, సూపరింటెండెంట్ శ్రీవాణి, విశేషసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# భక్తుడుపై ఆటో డ్రైవర్ల దాడి

## - వైరల్ అయిన వీడియో





**తిరుపతి, పబ్లిక్ టుడే:** తిరుపతి రైల్వే స్టేషన్?లో భక్తుడిపై ఆటో డ్రైవర్లు దాడికి దిగిన ఘటన భక్తుల్లో భయాందోళనలకు కారణమైంది. కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వెంకన్నను దర్శించుకోవడానికి వందల కిలోమీటర్లు ప్రయాణం చేసి భక్తులు తిరుమలకు వెళుతుంటారు.ఽఅలాంటి భక్తులపై శ్రీనివాస మంగాపురం, శ్రీవారి మెట్టుకు వెళ్లే ఫ్రీ బస్ స్టాప్ వద్ద ఆటోడ్రైవర్లు దాడికి దిగారు.దాడికి సంబంధించిన వీడియోని కొందరు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఆటో డ్రైవర్ చెప్పిన రేటుకు భక్తుడు నిరాకరించడంతో అతడిపై తీవ్రంగా దాడి చేసి ఆటో డ్రైవర్లు గాయపరిచారు. తిరుపతి రైల్వే స్టేషన్ దగ్గర ఆటోవాలాల దందా రోజురోజుకు పెరిగిపోతుండటం గమనార్హం.తిరుపతి బస్టాండ్, రైల్వే స్టేషన్?ల దగ్గర నుంచి శ్రీవారి మెట్టు వరకు తిరుమల తిరుపతి దేవస్థానం భక్తుల కోసం ఉచిత బస్సులు ఏర్పాటు చేసింది. అయితే సమాచార లోపం కారణంగా భక్తుల్లో గందరగోళం నెలకొంది. ఉచిత బస్సుల టైమింగ్ భక్తులకు తెలియకపోవడంతో శ్రీవారి మెట్టు వరకు భక్తులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా ఆటోవాలాలు భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు22 కిలోమీటర్ల దూరానికి వందలకు వందలు డిమాండ్ చేస్తుండడంతో మరో మార్గం లేక ఆటోవాలాలతో బేరాలు ఆడాల్సి వస్తోంది. వాళ్ల చెప్పిన రేటుకు ఓకే అంటేనే భక్తులను శ్రీవారి మెట్టు వరకు చేరుస్తున్నారు. లేదంటే.. ఇలా భక్తులను దూషిస్తూ.. ఇలా దాడులకు పాల్పడుతూ ఆటో డ్రైవర్లు ప్రవర్తిస్తున్న తీరుపై భక్తులు మండిపడుతున్నారు.



### విద్యార్థులకు అన్ని సౌకర్యాలు

## కల్పిస్తున్నాం

(మొదటిపేజీ తరువాయి)

తెలుసుకున్నారు. అనంతరం మంత్రి స్వామి మాట్లాడుతూ.. సంక్షేమ వసతి గృహాలు,గురుకులాల విద్యార్థుల విద్య, ఆరోగ్యం, భద్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. రూ.143 కోట్లతో హాస్టళ్లలో మరమ్మతులు చేశాం. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలి. పేద విద్యార్థులు సమాజంలో గొప్ప స్థాయికి ఎదగాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమనిమంత్రి డోలా.బాల వీరాంజనేయస్వామి అన్నారు.



## భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



**శ్రీరంగరాజపురం, పబ్లిక్ టుడే :** శుక్రవారం కొలిచిన వారికి కొంగు బంగారం సిరులను కురిపించే వరలక్ష్మి వ్రతం పండుగను శుక్రవారం వాడ వాడల మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు పలు కుటుంబాలలో అమ్మవారి రూపా ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది పిండి వంటలు నైవేద్యం ఉంచి వ్రతాన్ని జరుపుకున్నారు. ముత్తయిదు మహిళలకు ఇంటికి పిలిచి వారికి వాయినాలు ఇచ్చి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్వేటి నగరం మహారాజా వారి ఇలవేల్పు ఆరి మాను గంగమ్మ ఆలయంలో అర్చకులు వెంకటాచలపతి అమ్మవారి రూపాన్ని తీర్చిదిద్ది వేద మంత్రం పట్టణం మధ్య ఘనంగా నిర్వహించారు. గ్రామాల ప్రజలు అమ్మవారి పూజలో పాల్గొన్నారు. గ్రామ పౌరోహితులు కార్తికేయన్ పలు గ్రామాల్లో వరలక్ష్మి వ్రతం పూజను మంత్రోచ్ఛారణతో నిర్వహించారు.

## ఘనంగా వరలక్ష్మి దేవి వ్రత పూజలు



**రామచంద్రపురం, పబ్లిక్ టుడే :** రామచంద్రాపురం మండలం రాయలచెరువు గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మేకల తిరుమలరెడ్డి స్వగృహమునందు శ్రీ వరలక్ష్మి దేవి వ్రతం పూజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో శ్రీ శక్తి పీఠాధీశ్వరి మాతాజీ శ్రీ రమ్యానంద భారతి స్వామిని వారు పాల్గొని శ్రీ వరలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా శ్రీ వరలక్ష్మి వ్రతముకు విచ్చేసిన మాతాజీ కి పూర్ణకుంభంతో స్వాగతం పలికి శ్రీమతి మేకల మాధవి తిరుమలరెడ్డి దంపతులు. మాతాజీ వారికి పాదపూజ చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం మాతాజీ వారు శ్రీ వరలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులను ఆశీర్వదించారు. అనంతరం భక్తులకు మాతాజీ వారు తీర్థప్రసాదాలు అందజేశారు. మేకల మాధవి దంపతులు శ్రీ వరలక్ష్మి దేవి వ్రతం భక్తి శ్రద్ధలతో చేశారు. పూజలో పాల్గొన్న మహిళలకు పసుపు కుంకుమ గాజులు బొందారం జాకెట్ వాయనాలు ఇచ్చారు. పూజలో పాల్గొన్న మహిళలకు భక్తులకు అన్నదాన వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



### శ్రీవేణుగోపాల స్వామివారి ఆలయంలో

# శాస్త్రోక్తంగా వరలక్ష్మీ వ్రతం





**కార్వేటినగరం, పబ్లిక్ టుడే :** కార్వేటినగరం శ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు.ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామి, అమ్మవార్లను మేల్కొల్పి మూలవర్లకు అభిషేకం నిర్వహించారు. అనంతరం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆలయ ఊంజల మండపంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు లక్ష్మీ సహస్రనామార్చన, అష్టోత్తర శత నామావళి నిర్వహించారు. అనంతరం శ్రీ వరలక్ష్మీ వ్రతం మహత్యాన్ని ఆలయ అర్చకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో రవి, సూపరింటెండెంట్ ముని శంకర్, టెంపుల్ ఇన్స్పెక్టర్ సురేష్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అలుపెరుగని అక్షర సేనాని.. శ్రీనివాస్

### - ఆర్.ఎం.ఉమామహేశ్వర రావు - కే.ఎన్.జయమ్మ స్ఫూర్తి పురస్కారం ప్రదానం




**పలమనేరు, ఆగస్టు 8, పబ్లిక్ టుడే:** పత్రికా సంపాదకులుగా,సాహిత్య, సామాజిక విశ్లేషకుడిగా కె.శ్రీనివాస్ గారి సాహిత్య ప్రస్థానం ఎందరికో స్ఫూర్తిదాయకమని , ప్రముఖ సాహితీవేత్త ఆర్. ఎం.ఉమా మహేశ్వ రరావు పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం పలమనేరు లయన్స్ క్లబ్ సమావేశ మందిరంలో కె.ఎన్.జయమ్మ స్ఫూర్తి ప్రదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉమా మహేశ్వరరావు అధ్యక్షోపన్యాసం చేస్తూ శ్రీనివాస్ నిజాన్ని నిర్భీతిగా అక్షరీకరించిన పాత్రికేయ శిఖరమని కొనియాడారు. ఆధిపత్య భావ జాలాన్ని, దోపిడీ విధానాల్ని,సామాజిక అసమానతల్ని తన రచనల ద్వారా శ్రీనివాస్ ఎండ గట్టారని పేర్కొన్నారు. ఆయనొక శాంతియుత ధిక్కార స్వరమన్నారు. పురస్కార గ్రహీత కె.శ్రీనివాస్ మాట్లాడుతూ అమ్మకు మించిన సామాజిక సంస్కర్త ఎవరూ లేరన్నారు.జయమ్మ కుమారునిగా పలమనేరు బాలాజీ, ఏకలవ్య కాలనీ ఎరుకల కథల్లో తన తల్లి ఔన్నత్యాన్ని అక్షరీకరించి,ఆమెను చిరంజీవిగా నిలిపారన్నారు. తెలుగు రాష్ట్రాలు భౌగోళికంగా విడిపోయినా సాహిత్య సాంస్కృతి అవిభాజ్యమన్నారు. పలమనేరు లాంటి మారుమూల పట్టణంలో సాహితీ సంస్థల క్రియాశీలత అన్ని ప్రాంతాల వారికి ప్రేరణ కలిగిస్తుందని అన్నారు. పలమనేరును ఇంటిపేరుగా నిలుపుకున్న బాలాజీ మూడున్నర దశాబ్దాలుగా చేస్తున్న సాహితీ సేవ ఆదర్శనీయమన్నారు. ప్రముఖ సాహితీవేత్తలు జి.వెంకట కృష్ణ,సుంకోజి దేవేంద్రాచారి, రాఘవ శర్మ,సహదేవనాయుడు, నెమిలేటి కిట్టన్న,బాబ్జీ,కొత్తపల్లి సురేష్,టి ఎస్ ఏ కృష్ణమూర్తి, జొన్నవిత్తుల శ్రీరామ చంద్రమూర్తి, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజు తదితరులు ప్రసంగించారు.కార్యక్రమంలో పలమనేరు బాలాజీ గండికోట వారిజ, నేతాజీ సంధ్యారాణి, డాక్టర్ పవిత్ర, భార్గవ డాక్టర్ ప్రణీత, పలమనేరు రచయితల సంఘం, శ్రీపురం సీతారామయ్య నాగమణి చారిటబుల్ ట్రస్ట్, మహతి ఫౌండేషన్ బైరెడ్డిపల్లి, గ్రామ సేవా సమితి,శివాడి తెలుగు సాహిత్య సంస్కృతిక సమితి,జన విజ్ఞాన వేదిక, ఎ.పి.ఎన్జీవో అసోసియేషన్, పలమనేరు పరిరక్షణ సమితి, పలమనేరు ప్రకృతి మొదలైన సాహిత్య సంస్థలు,ప్రజా సంఘాలచే సంయుక్తంగా కె.శ్రీనివాస్ కు పౌర సన్మానం చేశారు. కె.శ్రీనివాస్ ను ఘనంగా సత్కరించి, 25వేల రూపాయల నగదు పురస్కారాన్ని పలమనేరు బాలాజీ అందించారు. యాక్ట్సు సంస్థ తరపున దశరథ రెడ్డి 25వేల రూపాయల నగదు పురస్కారాన్ని డాక్టర్ కె. శ్రీనివాస్ కు అందించారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ





**తిరుపతి రూరల్, పబ్లిక్ టుడే :** తిరుపతి రూరల్ మండలం పరిధిలోని తనపల్లి రఘునాథ్ రిసార్ట్స్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తిరుపతి, పాకాల, చంద్రగిరి, రామచంద్రాపురం, చిన్న గొట్టుగల్లు, యర్రావారిపాలెం మండలాలకు సంబంధించిన పలువురికి సిఎంఆర్ఎఫ్ సహాయనిధి ద్వారా సుమారు 23 లక్షల 17వేల 298 రూపాయలు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం. అనారోగ్య ,ఇతర సమస్యలతో బాధపడుతున్న విషయం స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే తక్షణమే స్పందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనారోగ్య, ఇతర సమస్యలతో బాధపడుతున్న వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేయాలని ఉన్నత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.సిఎంఆర్ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు పంపిణీ చేసిన ఎమ్మెల్యే . కష్టకాలంలో మా కుటుంబాన్ని ఆదుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే పులివర్తి నాని కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన భాధిత కుటుంబ సభ్యులు. కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 24 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

## - ముగ్గురు స్మగ్లర్లు అరెస్టు - రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం




**సత్యవేడు, పబ్లిక్ టుడే:** సత్యవేడు అటవీ పరిధిలోని జంబుకేశ్వరపురంలో ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లును అరెస్టు చేసి, వారి నుంచి 24 ఎర్రచందనం దుంగలు, రెండు మోటారు సైకిళ్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ హెడ్ శ్రీ ఎల్. సుబ్బారాయుడు గారి ప్రత్యేక కార్యాచరణలో భాగంగా టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీ పి. శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో డీఎస్పీలు శ్రీ ఎండీ షరీఫ్, శ్రీ శ్రీనివాసరెడ్డి మార్గనిర్దేశకత్వంలో ఆర్ఐ సాయి గిరిధర్ కు చెందిన ఆర్ఎస్ఐ టీ. విష్ణువర్ధన్ కుమార్ టీమ్ గురువారం సత్యవేడు అటవీ పరిధిలో స్థానిక ఎఫ్బీఓ కె. వేణుగోపాల్ తో కలసి కూంబింగ్ చేపట్టారు. శుక్రవారం తెల్లవారుజామున జంబుకేశ్వర పురం నీలగిరి తోటకు చేరుకోగా అక్కడ రెండు మోటారు సైకిళ్ళతో కొంతమంది వ్యక్తులు కనిపించారు. వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా వారిలో కొందరు పారిపోయారు. అయితే ముగ్గురిని పట్టుకోగలిగారు. వారు సమీపంలో దాచిన 24ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో ఒకరు తిరుపతి జిల్లాకు చెందిన వ్యక్తి కాగా, మరో ఇద్దరు తమిళనాడుకు చెందిన వారిగా గుర్తించారు. వారిని దుంగలుతో సహా తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పద్మావతి అమ్మవారి కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలి

## తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి



**తిరుచానూరు, పబ్లిక్ టుడే:** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రత మహోత్సవం శాస్త్రోక్తకంగా జరిగింది. ముందుగా అమ్మవారి ఉత్సవ మూర్తిని ఊరేగింపుగా ఆస్థానమండపానికి తీసుకువచ్చి పళ్ళు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన పందిరిలో అమ్మవారిని కొలువు తీర్చారు. వజ్రాభరణాలు, పట్టు వస్త్రాలు, సుగంధ పరిమళ పుష్పాలతో శోభయమానంగా అలంకరించారు. అనంతరం వేద పండితులు వరలక్ష్మి వ్రత మహోత్సవాన్ని ప్రారంభించారు. టిటిడి ఉన్నతాధి కారులు ఇతర బోర్డు సభ్యులతో కలిసి తుడా చైర్మన్, టిటిడి బోర్డు సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డి కుటుంబ సమేతంగా వ్రత పూజలో పాల్గొన్నారు. పూజ అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని పద్మావతి అమ్మవారి కృపా కటాక్షాలతో సకాలంలో వర్షాలు కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు వెల్లడించారు.

## ఎస్బీఐ వ్యాపారస్తులకు ఆర్థిక చేయూత




**శ్రీకాళహస్తి, ఆగస్టు 8, పబ్లిక్ టుడే:** శ్రీకాళహస్తిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 5శాఖలకు చెందిన సిబ్బంది శుక్రవారం వ్యాపారస్తులకు ఋణ మేళాను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి లోని పురవీధులలో సిబ్బంది ప్రచారం నిర్వహించారు,కేంద్ర ప్రభుత్వ పథకలైనటువంటి ప్రధానమంత్రి ముద్ర యోజన, ప్రధాన మంత్రి ఎంప్లాయ్మెంట్ జనరేషన్ పథకం మరియు ఎస్బీఐ కొత్తగా ప్రవేశపెట్టిన బిఆర్ఇ (బిజినెస్ రూల్ ఇంజిన్)పథకం గురించి వివరించారు,ఈ పథకంలో వ్యాపారస్తుల యొక్క జీఎస్టీ, ఐటీ రిటర్న్ అనుసరించి కంప్యూటర్ ద్వారా ఒకే ఒక్క గంట వ్యవధిలో ఋణం మంజూరు చేస్తారని తెలిపారు. ఇటువంటి ఆస్తి తరహా లేకుండా రెండు కోట్ల వరకు రుణం పొందవచ్చని అన్నారు, వ్యాపారస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాళహస్తి మెయిన్ బ్రాంచ్ మేనేజర్ ఫణి కుమార్, ఏ డి బి బ్యాంక్ మేనేజర్ మోహన్ రాజు తెలిపారు,ఈ కార్యక్రమంలో ఎస్బీఐ శ్రీకాళహస్తి అన్ని శాఖల ఉద్యోగులు దేవస్థానం, స్కిట్, కోవనూరు శాఖలమేనేజర్లు పాల్గొన్నారు..

## ఎస్ఐఆర్ పేరుతో పౌరసత్వాన్ని హరిస్తున్న బీజేపీ



**రేణిగుంట, పబ్లిక్ టుడే:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో డబుల్ ఇంజన్ సర్కార్ (బిజెపి) ప్రజల పరుసత్వాన్ని హరిస్తుందని సిపిఎం పార్టీ రేణిగుంట, ఏర్పేడు ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్ అన్నారు. బిజెపి అధికార దాహంతో మతతత్వం అజెండా అమలులో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆయుధంగా చేసుకుని బిజెపి పార్టీ నిరంకుశ పాలన అమలు చేయడానికి ఎస్ఐఆర్ దేశవ్యాప్తంగా అమలు చేయాలని కుట్రను రేణిగుంట ప్రజలు, మైనార్టీ ప్రజలు, లౌకిక వాదులు తీవ్రంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ వ్యతిరేకిస్తూ శుక్రవారం ఉదయం రేణిగుంట అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం పార్టీ ఆవాజ్ సంఘం, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో నిరసన ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రంగయ్య, ఆవాజ్ సంఘం రేణిగుంట మండల కన్వీనర్ షాన్వాజ్ , పట్టణ కన్వీనర్ దిలీప్ భాషా, నిజాముద్దీన్, హబీబ్ ఖాన్, ఖాదర్ బాషా, సిపిఎం నాయకులు సత్య శ్రీ, ఈశ్వరమ్మ, సెల్వరాజ్, రాజశేఖర్, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

### ఉమెన్స్ పాలిటెక్నిక్ కాలేజీలో
## డి ఫార్మసీ అడ్మిషన్లకు ప్రవేశాలు

**తిరుపతి, ఎస్.వి.యూనివర్సిటీ పబ్లిక్ టుడే :** శ్రీ పద్మావతి ఉమెన్స్ పాలిటెక్నిక్ కాలేజీకి ఐ ఎస్ ఓ సర్టిఫైడ్, ఎన్ బి ఏ అక్రిడిటెడ్, పి సి ఐ అప్రూవ్ మరల ఎస్ బి టి ఈ టి గుర్తింపు ఉంది. సదరు కాలేజీలో ప్రవేశాలకు దరఖాస్తులు 09 ఆగష్టు 2025 నుండి 19 ఆగష్టు 2025 వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయి. ఆసక్తి గల విద్యార్థినులు ఇంటర్మీడియట్‌లో ఎంపీ లేదా బైపీసీ ఉత్తీర్ణత సాధించిన వారు నేరుగా దరఖాస్తు చేయాలి. విద్యార్థినులకు ప్రభుత్వం నిర్ణయించిన కోర్సు ఫీజుతో పాటు ఉచితంగా హాస్టల్ వసతి మరియు భోజన సౌకర్యం కల్పించబడుతుంది.మరిన్ని వివరాల కోసం ఈ నెంబర్లను సంప్రదించండి: 9299008151, 9247575386, 8978993810.

## ఎస్ఐఆర్‌తో పౌరసత్వానికి ముప్పు



**శ్రీకాళహస్తి, ఆగస్టు 8, పబ్లిక్ టుడే:** బిజెపి ఆధీనంలోని కేంద్ర ఎన్నికల కమిషన్ చేపడుతున్న ఎస్ఐఆర్ విధానం వల్ల భారతీయుల పౌరసత్వానికి ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని సీపీఎం నాయకులు ఆరోపించారు. ఎస్ఐఆర్ విధానానికి వ్యతిరేకంగా స్థానిక పెండ్లి మండపం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ బీహార్ తరహాలోనే దేశ వ్యాప్తంగా ఓటర్ల జాబితాను ప్రత్యేకంగా సమగ్రంగా సవరించాలని చూస్తోందన్నారు. ఓటర్ల జాబితాలను సవరించే పేరుతో ఈసీ ఓటర్ల పౌరసత్వాన్ని నిర్ధారించే అధికారాన్ని స్వాధీనం చేసుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం కూడా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ అధీకృత ఎన్నికల సంఘం దేశ ప్రజాస్వామిక వ్యవస్థ పై చేస్తున్న దాడిని ప్రజలంతా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లాకార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, సంక్రాంతి వెంకటయ్య, రాధమ్మ, వెంకటేష్, వెలివేంద్రం , మూర్తి, జంషేదాలి తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ గుడిలో చోరీ

**పలమనేరు, ఆగస్టు 8, పబ్లిక్ టుడే:** గంగమ్మ గుడిలో చోరీ జరిగిన సంఘటన రూరల్ మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.... రూరల్ మండలంలోని కోలమాసనపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న గొల్లపల్లి గ్రామంలో వెలసియుండు గంగమ్మ తల్లి గుడిలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు గుడిలోనికి ప్రవేశించి హుండీలో ఉన్న నగదును దోచుకెళ్లడానికి ప్రయత్నించారు. అక్కడ అలజడి రావడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. వెంటనే పోలీసులు అక్కడికి వెళ్లి హుండీ ని పరిశీలించడం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరసింహులు తెలిపారు.



# ఎస్సీ, ఎస్టీలకు శ్మశానాలు ఏర్పాటు చేయాలి



**పలమనేరు, ఆగస్టు 8, పబ్లిక్ టుడే:** ఎస్సీ ఎస్టీలకు పక్కా స్మశానాలను ఏర్పాటు చేయాలని జాతీయ మానవ హక్కులు మరియు అవినీతి నిర్మూలన సంస్థ పలమనేర్ డివిజన్ కార్యదర్శి టి .మణి డిమాండ్ చేశారు. అందులో భాగంగా శుక్రవారం పలమనేర్ పట్టణంలోని మానవ హక్కుల కార్యాలయం నందు రమణారెడ్డి అధ్యక్షతన స్మశానాలు విషయంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారథి, సరస్వతి, గౌరవ అధ్యక్షులు అధ్యక్షులు టి. మునిరత్నం మాట్లాడుతూ జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసులు మేరకు ఎస్సీ ఎస్టీ కులాలకు జీవో నెంబర్ 12:35 ప్రకారం రెండు ఎకరాలు భూమి ఇవ్వాలని ఆదేశాలు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని తుంగలో తొక్కి ఎస్సీ ఎస్టీలకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. పోరాటాలు ద్వారా సాధించుకున్న హక్కులను అమలు చేయలేని రాష్ట్ర ప్రభుత్వం ఆ జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అనేక గ్రామాల్లో నూటికి 85% పక్కా స్మశానాలు లేక కుంటల్లో చెరువుల్లో చనిపోయిన వారిని పూడ్చుకుంటున్నారని తెలిపారు. గతంలో ఈ జీవో పూర్తిస్థాయిలో అమలు చేయాలని అనేకమైన పోరాటాలు చేసి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చినా చీమకు ట్టినంత చలనం పాలకులకు గానీ, అధికారులకు గానీ లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఎస్సీ ఎస్టీ హక్కులు హరించడం వల్లే వారిపై అగ్రకుల పెత్తందారులు విపరీతమైన దాడులు చేస్తూ, భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, మహిళలు, చిన్నారులకు రక్షణ కరువైందని వీటన్నిటికీ కారణం ప్రభుత్వాలు ప్రభుత్వ అధికారులేనని ఆరోపించారు. గతంలో స్మశానాలు ఏర్పాటు చేయాలని అధికారులను అడిగినప్పుడు భూములే లేవని నమ్మ పలికి ఆఖరుకు ప్రభుత్వ భూములను అప్పనముగా అగ్రకుల పెత్తందారులకు అవినీతికి పాల్పడి కట్టబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని ఉన్న స్మశానాలకు జీవో నెంబర్ 12:35 ప్రకారం మౌలిక వసతులు కల్పించాలని కోరారు. నారాయణ శెట్టి, సూర శ్రీనివాసులు ,శివన్న, వాణి, సుమతి, దాము, వెంకటేష్, మునెప్ప పాల్గొన్నారు.

# స్వాతంత్ర్యమా... నీ చిరునామా ఎక్కడ?



**వి.కోట, పబ్లిక్ టుడే:** స్వాతంత్రమా,నీ చిరునామా ఎక్కడ? అంటూ దెయ్యాలపల్లి ఎస్సీ కాలనీ ప్రజలు వాపోతున్నారు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని నెర్నిపల్లి పంచాయితీ దయ్యాల పల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీకి సుమారు 40 సంవత్సరాల క్రితం ప్రభుత్వం ఇంటి నివాస స్థలాలు మంజూరు చేసింది. ఈ స్థలాలలో ఎస్సీ కమ్యూనిటీకి చెందిన నిరుపేదలు నివాస గృహాలు ఏర్పాటు చేసుకున్నారు.నివాస గృహాలు ఏర్పాటు చేసుకునే సమయంలో కూడా కొంతమందికి ప్రభుత్వ గృహాలు మంజూరు కావడం మరికొంతమందికి ప్రభుత్వ గృహాలు మంజూరు కాకపోవడం అప్పులు చేసి సొంతింటి కల నెరవేర్చుకున్నారు. మౌలిక సదుపాయాల్లో భాగంగా స్వాతంత్రం వచ్చే 79 సంవత్సరాలు ముగుస్తున్నప్పటికీ ఎస్సీ కుటుంబాల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే కొనసాగుతున్నది.రాజ్యాంగం కల్పించిన హక్కులను సంపూర్ణంగా సంబంధిత అధికారులు అమలు పరచక పోవడమే ఎస్సీల అభివృద్ధి ప్రశ్నార్థకంగా మిగిలిపోయింది. ఈ నేపథ్యంలో మురుగునీటి కాలువలను కూడా కొంతమంది ఆక్రమించుకోవడంతో వరలక్ష్మి పండుగ సందర్భంగా శుక్రవారం జోరుగా వాన కురవడంతో, వర్షపు నీరు వెళ్లడానికి మురుగునీటి కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు ఎస్సీలు నివాస గృహాల్లోకి నేరుగా చేరిపోయాయి. గ్రామ సర్పంచిని మురుగునీటి కాలువలు కట్టాకి గురైన ఎన్నిసార్లు విన్నవించుకున్నప్పటికీ ఎస్సీలకు న్యాయం జరగలేదు. మండల స్థాయి అధికారులు ఎవరైనా మా సమస్యను గుర్తించి డ్రైనేజీ వ్యవస్థను బాగు చేస్తారేమోనని వేచి చూసినప్పటికీ ఎవరెవరు బాధ వారిది. శుక్రవారం కురిసిన చిన్న పాటి వర్షానికి దయ్యాలపల్లి ఎస్సీ కాలనీ మొత్తం నీటి గుంటగా మారిపోయింది అనడానికి సందేహం లేదు. రాజ్యాంగం కల్పించిన హక్కుల్లో భాగంగా పేదవానికి మౌలిక సదుపాయాలు ఇప్పటికీ దగ్గరకు రాకపోవడం శోచనీయం. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎస్సీ తలరాతలు మారలేదు. దెయ్యాల పల్లె ఎస్సీ కాలనీ మరుగుదొడ్లు మంజూరు కోసం మరో పోరాటానికి సిద్ధమవుతున్నట్లు సంఘం నేతలు పేర్కొన్నారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి ఎస్సీ కుటుంబాలు అవసరం మేరకు మరుగుదొడ్లు ఏర్పాటు చేసి వర్షపు నీరు నివాసగృహాల్లో కి రాకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

## పోలీసుల గస్తీ పెంచండి



**శ్రీకాళహస్తి, ఆగస్టు 8, పబ్లిక్ టుడే:** ఆర్టీసీ బస్టాండ్ నుండి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, మహిళా కళాశాల వరకు విద్యార్థుల భద్రత దృష్ట్యా పోలీస్ గస్తీని పెంచి ఆకతాయిల ఆగడాలను కట్టడి చేయాలని శ్రీకాళహస్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదర్ రెడ్డి శుక్రవారం డీఎస్పీ నరసింహామూర్తికి వినతి పత్రం అందజేశారు. ఆర్టీసీ బస్టాండ్ నుండి ఏరియా ఆసుపత్రి, మహిళా జూనియర్ కళాశాల వరకు పోలీసులకు గస్తీ పెంచి రక్షణ కల్పించాలని అన్నారు. శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, రేణిగుంట మండల అధ్యక్షులు రాహుల్, యువజన అధ్యక్షులు నవీన్, పురుషోత్తం, నాగరాజు, అరుణ్, సంతోష్, జోసెఫ్, చరణ్, సారథి, ఆసిఫ్, తేజ, మహేష్ పాల్గొన్నారు.

# పౌరసత్వ చట్ట సవరణ వ్యతిరేకించండి




**చిత్తూరు, ఆగస్టు 8, పబ్లిక్ టుడే :** బీహారు లో ఎన్నికలలో గెలవడానికి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో ప్రజాస్వామ్యాన్ని కూని చేయడాన్ని దేశంలోని ప్రతి పౌరుడు వ్యతిరేకించాలని సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పిలుపు నిచ్చారు దొడ్డిదారిన అమలు చేస్తున్న పౌరసత్వ చట్ట సవరణను నిలుపుదల చేయాలని పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్ర ప్రమాద కలిగించే ఎస్ ఐ ఆర్ బిజెపి ప్రభుత్వం తీసుకొస్తున్నదని ఆయన దుయ్యబట్టారు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కేంద్ర ఎన్నికల సంఘంపై ఒత్తిడి తీసుకువచ్చి బీహార్ల ఓటర్ల జాబితాను సవరణకు పూనుకున్నదని ఆయన తెలిపారు పౌరులు ఓటు హక్కును ప్రశ్నించే నిబంధనలు ఇందులో ఉన్నాయని స్వతంత్రంగా వ్యవహరించాల్సిన రాజ్యాంగ వ్యవస్థ ఎన్నికల సంఘం దానికి విరుద్ధంగా హొం మంత్రి ఆదేశాలతో ఓటర్ లిస్టులను మార్చేసినదని లక్షలాదిమంది ఫోటోకు తొలగించడం దారుణమని ఆయన పేర్కొన్నారు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ పరిశీలన చేయనున్నట్లు ఉత్తర్వులు ఇచ్చిందని ఇదే పద్ధతిని దేశవ్యాప్తంగానే రాష్ట్రాలు అమలు చేయాలని ఆయన కోరారు.

విషయంలో వైసిపి బిజెపిని బలపరిచే వైఖరిని తీసుకుందని ఇది చాలా దుర్మార్గమని వైయస్సార్ సిపి నాయకులు కార్యకర్తలు ఆలోచించాలన్నారు బీహార్ లాగానే మన రాష్ట్రంలో కూడా ఎస్ ఐ ఆర్ నుఅమలు చేయాలని డిమాండ్ చేసిందన్నారు మత ప్రాతిపదికన పౌరులను విభజించే కుట్ర బిజెపి చేస్తున్నదని ప్రజలు ఐక్యంగా ప్రతికటించాలని సిపిఎం కోరుతున్నదని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జ్యోతిరావు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి



**పిచ్చాటూరు, పబ్లిక్ టుడే :** మండపాలు ఏర్పాటు చేయాలనుకున్న నిర్వాహకులు వినాయక స్వామి ప్రతిమలు ఏర్పాటు చేయు తేదికి కనీసం ఏడు రోజుల ముందు మండల పరిధిలోని పోలీస్ స్టేషన్ అనుమతులు పొందవలెను, మండపాలను ముందస్తుగా తనిఖీ చేసి అప్రూవ్ చేసిన ప్రాంతాల్లోనే వేయవలెను ఎటువంటి ట్రాఫిక్ కి అంతరాయం కలిగించేలా ఏర్పాటు చేయకూడదు. మైకులు మరియు మ్యూజిక్ సిస్టంలను నిర్ణీత సౌండ్స్ లోనే ఉపయోగించవలెను ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటలకు మాత్రమే ఉపయోగించవలెను అలా కాదని అనుమతులకు విరుద్ధంగా ప్రవర్తించిన ఎడల చట్టప్రకారం చర్యలు తీసుకోబడును. గణేష్ ప్రతిమలను వీలైనంతవరకు నాచురల్ గా తయారు చేసినవి ఉపయోగించు విధంగా సంబంధిత నిర్వాహకులు చర్యలు తీసుకోగలరు.అదేవిధంగా ఊరేగింపులో ఎటువంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం గాని ఆయుధాలను ప్రదర్శించడం గాని చేయకూడదు అలా చేసిన ఎడల చట్టపరమైన చర్యలు తీసుకోబడును ఊరేగింపు చేయు రోడ్డుని ముందుగా పోలీసులకు తెలియపరచి అనుమతి తీసుకోవలెను. మండపాల దగ్గర సరైన పద్ధతిలో లైటింగ్, అగ్ని ప్రమాద నిర్వహణ సంబంధించిన సేఫ్టీ మరియు ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచవలెను. కావున నిర్వాహకులు పై సూచనలు పాటించి ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలని ఎస్సై వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. తెలిపారు

# ఘనంగా వరలక్ష్మీ వ్రతం



**తిరుపతి ఆగస్టు 8, పబ్లిక్ టుడే :** టిడిపి బీసీ నాయకులు వేలూరు జగన్నాధం ఇంట ఘనంగా వరలక్ష్మీ వ్రతం పూజా కార్యక్రమంలో నిర్వహించారు. స్థానిక మున్సిపల్ పార్క్ వెనకాల ఉన్న ప్రాదీ కాలనీ లో శు క్రవారం జరిగిన వరలక్ష్మి వ్రతం పూజా కార్యక్రమం లో భరత్ స్వామి వేదమంత్రాలతో వర లక్ష్మీ వ్రతం ను పూజ గణపతి తో ప్రారంభించి పూజిత విచ్చేసిన మహిళలచే వరలక్ష్మీ అమ్మవారి మంత్రమును



పఠించారు. సందర్భంగా తెలియజేసిన పార్టీ టీసే నాయకులు సాధికార కమిటీ రాష్ట్ర సభ్యులు వేలూరు జగన్నాథం మాట్లాడుతూ ప్రతి శ్రీ తన భర్త తన కుటుంబం తనవాళ్లు అందరూ బాగుండాలని ఈ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో మహిళలు జరుపుకుంటారు. అలాగే అందరూ తమ తమ స్తోమతతో పూజా విధానాన్ని నిర్వహించుకుంటారు . ఈ పూజలో పాల్గొన్న ప్రతి మహిళ ఈ పూజ జరిపినట్టే వరలక్ష్మి అమ్మవారి ని శ్లోకాలతో జపించి పూజా కార్యక్రమం ప్రతి ఒక్కరూ నిర్వహించినట్టే అన్నారు. ఈ పూజా కార్యక్రమానికి విచ్చేసిన మహిళలందరికీ నూతన వస్త్రాలు చీర జాకెట్ పసుపు కుంకుమ బొందారం రూపంలో స్టీల్ పెట్టి అందరికీ అందించారు . అలాగే పూజా కార్యక్రమానికి విచ్చేసిన మగవారికి పంచ టవలు పండ్లను పూజలో ఉంచిన డబ్బును ఆ తట్ట లో పెట్టి అందించారు. ఈ పూజా కార్యక్రమంలో తన కుటుంబ సభ్యుల హేమావతమ్మ , రోహిత్ బాబు . తన మిత్ర బృందం కుటుంబ సభ్యులు కామేశ్వరమ్మ,, స్రవంతి, షణ్ముఖ ప్రియా, అనురాధ, సత్య ప్రభ, శ్యామల శ్యాంబోల హరి , రెడ్డప్ప, చంద్రబాబు, యువరాజు, ఢిల్లీ ప్రియా, దేవి, కళ చంద్రారెడ్డి, త్యాగరాజు, విజయ శేఖర్ రెడ్డి చంద్రమౌళి ల కుటుంబ సభ్యులు బండ్ల సోమేశ్వర్ పాల్గొన్నారు.

# విద్యుత్ వినియోగదారులకు అంతరాయం

**పలమనేరు, ఆగస్టు 8, పబ్లిక్ టుడే:** విద్యుత్ వినియోగదారులకు విన్నపం ఇందుమూలంగా తెలియజేయడమేమనగా పలమనేరు మున్సిపాలిటీ పరిధి యందు టీ.ఎస్ అగ్రహారం గ్రామం నందు కొత్తగా 220 కెవి విద్యుత్ టవర్స్ నిర్మాణం కొరకు రేపటి నుండి అనగా 9.08.2025 నుండి 11.08.2025 మూడు దినములు పగటిపూట టి.ఎస్ అగ్రహారం గ్రామమునకు మాత్రమే ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉండును, కావున టీ.ఎస్ అగ్రహారం గ్రామ విద్యుత్ వినియోగదారులు, ప్రజలు విద్యుత్ శాఖ వారికి సహకరించవలసిందిగా కోరడమైనది. రేపు 09.08.2025 రెండో శనివారము కావున విద్యుత్ 220కే వి పలమనేరు సబ్ స్టేషన్లో గల 33కే.వి లైన్లో మరమ్మతులు కారణంగా పలమనేరు అర్బన్, పలమనే రూరల్, గంగవరం, బైరెడ్డిపల్లి మండలంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయము ఉండును. కావున ప్రజలు విద్యుత్ వినియోగదారులకు సహకరించవలసిందిగా వి.జీవన్ కుమార్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, విద్యుత్ శాఖ, పలమనేరు వారు కోరడమైనది.

# ఘనంగా మహేంద్ర జన్మదిన వేడుకలు



**బంగారుపాళ్యం, ఆగస్టు 8, పబ్లిక్ టుడే:** చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాలెం మండలం తగ్గువా రిపల్లె పంచాయతీ కొత్తపల్లి గ్రామానికి చెందిన మహేంద్ర జన్మదిన వేడుకలను బంగారుపాళ్యం మార్కెట్ యార్డ్ సమీపంలో గల ఊటీ టీ షాప్ వద్ద స్నేహితుల ఆధ్వర్యంలో ఘనంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా వైయస్సార్ సోషల్ మీడియా అధ్యక్షుడు కిషోర్ కుమార్ రెడ్డి మండల యువత అధ్యక్షుడు గజేంద్ర తగ్గువారిపల్లె ఎంపిటిసి హేమచంద్ర రఘు ముబారక్ జగదీష్ జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.

# కుక్కల దాడిలో ఎనిమిది పొట్టేళ్ల మృతి



**తొట్టంబేడు, ఆగస్టు 8, పబ్లిక్ టుడే:** మండలంలోని తాటిపర్తి పంచాయతీ మల్లి గుంట గ్రామంలో గురువారం రాత్రి కుక్కల దాడిలో పొట్టేళ్లు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే కోగిల సుధాకర్ పశుపోషకుడుగా జీవనం కొనసాగిస్తున్నారు. రోజు లాగానే పొట్టేళ్లను మేపుకొని వచ్చి గురువారం సాయంత్రం పొట్టేలను దొడ్డిలో కట్టేశారు. అందరూ నిద్రిస్తున్న సమయంలో కుక్కలు ఒక్కసారిగా మూకుమ్మడిగా దాడి చేయడంతో ఎనిమిది పొట్టేలు మృత్యు వాతపడ్డాయి. వాటితో పాటు ఐదు పొట్టేలు గాయపడ్డాయి. విషయం తెలుసుకున్న పశు సంవర్ధక శాఖ ఏ.డి గోవిందరాజు భాస్కర్, తొట్టంబేడు పశుసంవర్ధక శాఖ వైద్యురాలు ప్రియాంక ఆ గ్రామానికి వెళ్లి మృతి చెందిన పొట్టేళ్లను పరిశీలించడం జరిగింది. అనంతరం వారు ఈ విషయాన్ని ఎమ్మార్వో, ఎం.పీ.డీ.వో లకు తెలియజేసి నష్టపోయిన రైతుకు మేలు జరిగే విధంగా ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా కృషి చేయాలని కోరారు. పొట్టేళ్లను మేపుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్న కోగిల సుధాకర్ ఈ సంఘటన వలన సుమారు రెండు లక్షల రూపాయల వరకు నష్టపోయారని ప్రభుత్వం వెంటనే ఆదుకుని ఆ కుటుంబానికి అండగా నిలవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## 3న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



**చిత్తూరు, ఆగస్టు 8, పబ్లిక్ టుడే:** మామిడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రకటించిన కిలో 12 రూపాయలు చొప్పున సత్వరం రైతుల అకౌంట్లో వే యాలని మామిడి రైతుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హరిబాబు చౌదరి సహాయ కార్యదర్శి హరిబాబు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు మామిడి రైతుల రెండో దశ పోరాట కార్యక్రమంలో భాగంగా రూపొందించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గుజ్జు యజమానులకు ర్యాంపు నిర్వాహకులకు జంకుతూ 12 రూపాయలు చెల్లించడంలో మీనా మేషాలు లెక్కిస్తున్నారని వారు విమర్శించారు ప్రభుత్వం వారి పట్ల దయ దాచిణ్యం ఉంటే12 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిందిగా వారు డిమాండ్ చేశారు కేంద్ర ప్రభుత్వం సైతం నూరు కోట్ల రూపాయలు వరకు మొట్టమొదటిసారిగా రైతులకు తోడ్పడుతున్నందున ప్రభుత్వం పైన అదనపు భారం కూడా పడదని వారు పేర్కొన్నారు మామిడి రైతుల రెండో దశ ఉద్యమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 50వేల మంది రైతులతో సంతకాలు సేకరించి ముఖ్యమంత్రి కి ఈ నెలలో సమర్పిస్తామని వారు తెలిపారు అందులో భాగంగా ఈనెల 13న చిత్తూర్ గాంధీ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో జరుగు నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మామిడి రైతులు పాల్గొ నాలని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా నేతలు చంద్రమౌళి సుకుమార్ సుధా రమణా తదితరులు పాల్గొన్నారు

## నేడు ఏపీలో భారీ వర్షాలు



**అమరావతి, పబ్లిక్ టుడే:** బీఏపీలోని పలు జిల్లాల్లో నేడు శనివారం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దక్షిణ కోస్తాంధ్ర నుండి ఉత్తర శ్రీలంక వరకు తమిళనాడు తీరం మీదుగా ద్రోణి కొనసాగుతున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు.పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడేందుకు అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.శనివారం ప్రకాశం, నెల్లూరు,కర్నూలు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన మోస్తారు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అలాగే ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించిన ప్రఖర్ జైన్ సూచించారు.

# వినుత కోటకు షరతులతో బెయిల్ మంజూరు



**తిరుపతి, ఆగస్టు 8 , పబ్లిక్ టుడే:** రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన శ్రీకాళహస్తిలో రాయుడు హత్యకు సంబంధించి ఎ3 ముద్దాయిగా ఉన్న వినుత కోటకు చెన్నై కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. జూలై 7వ తేదీన శ్రీకాళహస్తి జనసేన ఇన్చార్జి వినుత కోట తన కారు డ్రైవర్ రాయుడు అలియాస్ శ్రీనివాస్ ను హత్య చేసి చెన్నై సమీపంలోని చెరువులో పడవేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో శ్రీకాళహస్తి జనసేన ఇన్చార్జి వినుతకోట భర్త చంద్రబాబు ఏ 1 ముద్దాయిగా ఉండగా ఏ 2గా షేక్ తసార్, ఏ 3 గా వినుతకోట, ఏ 4 గా శివకుమార్ గోపి లను చెన్నై పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు పంపారు. దీంతో జనసేన పార్టీ నుంచి కూడా వినీత కోట,చంద్రబాబు దొంగతనం సస్పెండ్ చేసిన విషయం విధితమే. అయితే తన ఆరోగ్య రీత్యా బెయిల్ మంజూరు చేయాలని వినుత కోట కోర్టును అభ్యర్థించగా ఈనెల 6 తేదీన కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ప్రతిరోజు ఉదయం 10 గంటల లోపు సెవెన్ వెల్స్ పోలీస్ స్టేషన్ కు వచ్చి సంతకాలు చేయాలన్న షరతులు కోర్టు విధించింది. ఏడు ఎనిమిదవ తేదీల్లో నిబంధనలు పాటిస్తూ పోలీస్ స్టేషన్లో వినుత సంతకాలు చేసినట్లు సమాచారం.

# ప్రమాదం జరగకుండా కానిస్టేబుల్ తేజ చర్యలు





**బంగారుపాళ్యం, ఆగస్టు 8, పబ్లిక్ టుడే:** చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలంలోని బెంగళూరు చెన్నై హైవే నలగాంపల్లి పై ఓవర్ పై శు క్రవారం సాయంత్రం జోరున కురుస్తున్న వాన వలన నీళ్లు వెళ్లే దారి లేక పై ఓవర్ పైన ఉండే రంధ్రాలు మూసుకొని పోవడం వల్ల చాలా ఎక్కువ మోకాళ్ళ లోతు నీళ్లు పై ఓవర్ పైన నిలిచిపోవడం గమనించి అటువైపు పోతున్న డి.ఎస్.పి ఆఫీసులో పనిచేస్తున్న కానిస్టేబుల్ తేజ అతనితో వస్తున్న స్నేహితుని సాయంతో సుమారు గంటసేపు శ్రమించి పై ఓవర్ పై ఉన్న నీళ్లు పోవుటకు రంధ్రాల్లో చిక్కుకున్న చెత్తను తొలగిస్తూ హైవే మీద నడుస్తున్న వాహనాలు దారి చూపిస్తూ కనిపించారు.నిజానికి పై ఓవర్ మీద ఉన్న మోకాళ్ళ లోతు నీళ్లు నిలిచిపోయి ఉన్నాయి. ఆ నీళ్లల్లో హైవేపై వేగంగా వస్తున్న వాహనాలు డివైడర్ ని ఢీకొని ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని ప్రమాదం గమనించి తేజ అక్కడే ఉండి దాదాపు గంటసేపు శ్రమించి ఆ నీరు క్లియర్ చేసి ఇక వాహనదారులకి ఇబ్బందని ఉండదని తెలిసే వరకు శ్రమించి వానలో తడిసి కష్టపడ్డారు.డీఎస్పీ ఆఫీసులో కానిస్టేబుల్ గా పనిచేస్తున్న ఆయన మానవత్వానికి వాహనదారులు, ప్రజలు అభినందించారు.

# ఎట్టకేలకు సిగ్నల్

## ఎంపీ గురుమూర్తి కృషితో బీఎస్ఎన్ఎల్ టవర్ల ఏర్పాటుకు మార్గం సుగమం



**తిరుపతి, పబ్లిక్టుడే:** తిరుపతి పార్లమెంటు పరిధిలోని గూడూరు నియోజకవర్గం పూడిరాయదొరువు, సూళ్ళూరుపేట నియోజకవర్గం ఇరకం దీవిలో ఎట్టకేలకు బిఎస్ఎన్ఎల్ 4జి టవర్ల ఏర్పాటుకు అడ్డంకులు తొలగాయి. తీర ప్రాంత గ్రామాలైన పూడిరాయదొరువు, ఇరకం దీవిలో సెల్ ఫోన్ సిగ్నల్ సరిగా లేక తుఫాను వంటి అత్యవసర సమయాలలో వారు ఎదుర్కొంటున్న సమస్యలని అక్కడ పర్యటించిన సమయంలో స్థానికుల ద్వారా తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఎంపీ గురుమూర్తి బిఎస్ఎన్ఎల్ దేశవ్యాప్తంగా సరిహద్దు, మారుమూల గ్రామాల్లో 4జి టవర్లను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో, పూడిరాయదొరువు, ఇరకం దీవి గ్రామాలను కూడా ఆ ప్రాజెక్టులో భాగంగా ఎంపికి చేయాలని కోరడం జరిగింది. టవర్ల ఏర్పాటుకు బిఎస్ఎన్ఎల్ అంగీకారం తెలిపినా ఈ రెండు ప్రాంతాలు ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలో ఉండటంతో, అటవీ శాఖ అనుమతులు అవసరమయ్యాయి. ఇది టవర్ల ఏర్పాటుకు ప్రధాన అడ్డంకిగా మారింది. తదుపరి తిరుపతి ఎంపి కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో అటవీ శాఖ అనుమతులు, పూడిరాయదొరువు టవర్ కోసం విద్యుత్ కనెక్షన్ ఏర్పాటులో సమస్యలని బిఎస్ఎన్ఎల్ అధికారులు ఎంపీకి వివరించారు. స్పందించిన ఎంపి గురుమూర్తి విద్యుత్ కనెక్షన్ ఏర్పాటుకు సదరు శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించారు. అటవీ శాఖ అనుమతుల కోసం కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ మంత్రి భూపేంద్ర సింగ్ కి లేఖ రాశారు. కాగా శాఖా పరమైన అనుమతులు మంజూరు చేస్తూ అటవీ శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని ఎంపి గురుమూర్తి తెలిపారు. టవర్ల నిర్మాణానికి మార్గం సుగమం కావడంతో త్వరలోనే ఈ గ్రామాలకు నాణ్యమైన మొబైల్ నెట్వర్క్ సేవలు అందుబాటులోకి రానున్నాయని హర్షం వ్యక్తం చేశారు.

# అమెరికా సుంకాల ఒత్తిడిలో భారత మార్కెట్లు!



**భారత ఆర్థిక విభాగం, పబ్లిక్ టుడే :** భారత ఆర్థిక వ్యవస్థ శుక్రవారం(ఆగస్టు 8, 2025) అనేక కీలక పరిణామాలను సాక్ష్యంగా చూసింది. అంతర్జాతీయ వాణిజ్య ఒత్తిడులు, స్టాక్ మార్కెట్ హెచ్చుతగ్గులు, కార్పొరేట్ ఫలితాలు, మరియు కొత్త ఐపీఓలు వంటి అంశాలు శుక్రవారం వ్యాపార వార్తల్లో ప్రముఖంగా నిలిచాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ఎగుమతులపై విధించిన కొత్త సుంకాలు మరియు దేశీయ కంపెనీల త్రైమాసిక ఫలితాలు మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేశాయి.

**స్టాక్ మార్కెట్:** సుంకాల ఒత్తిడితో పతనం : శుక్రవారం భారత స్టాక్ మార్కెట్లు గణనీయమైన నష్టాలను చవిచూశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 765 పాయింట్లు (0.95%) పడిపోయి 79,857.79 వద్ద ముగిసింది, అయితే ఎన్ఎస్ఈ నిఫ్టీ 233 పాయింట్లు (0.95%) తగ్గి 24,363.30 వద్ద స్థిరపడింది. ఈ పతనానికి ప్రధాన కారణం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ఎగుమతులపై విధించిన 50% సుంకాలు, ఇవి ఆగస్టు 6న ప్రకటించబడ్డాయి. ఈ సుంకాలు భారత ఎగుమతులపై 2024లో 2.4% నుండి 2025లో 20.7%కి పెరిగాయి, దీనివల్ల టెక్స్‌టైల్స్, రసాయనాలు, ఆటో ఆంక్సిలరీలు, రత్నాలు మరియు ఆభరణాలు, సీఫుడ్ వంటి రంగాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.

విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐలు) వరుసగా పది రోజుల పాటు నికర విక్రయాలను కొనసాగించడం కూడా మార్కెట్‌పై ఒత్తిడిని పెంచింది. శుక్రవారం రియల్టీ మరియు మెటల్స్ రంగాలు అత్యధిక నష్టాలను నమోదు చేశాయి. జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ హెడ్ ఆఫ్ రీసెర్చ్ వినోద్ నాయర్ మాట్లాడుతూ, “అమెరికా సుంకాలు మరియు బలహీనమైన త్రైమాసిక ఫలితాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. భారత ఆర్థిక వృద్ధి అంచనాలు 2025 మరియు 2026 కోసం సవరించబడ్డాయి” అని పేర్కొన్నారు.

**కార్పొరేట్ ఫలితాలు:** మిశ్రమ సంకేతాలు : శుక్రవారం అనేక ప్రముఖ కంపెనీలు తమ త్రైమాసిక ఫలితాలను ప్రకటించాయి, ఇవి మిశ్రమ ఫలితాలను చూపించాయి:

**టాటా మోటార్స్ :** శుక్రవారం ప్రకటించిన ఫలితాలలో టాటా మోటార్స్ లాభం 2.2% తగ్గుదలతో రూ. 633.3 కోట్లకు చేరింది, ఇది అమెరికా సుంకాలు మరియు నెమ్మదిగా ఉన్న అమ్మకాల ప్రభావంగా ఉంది.

**హెచ్‌పీసీఎల్ :** హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (ఎచ్‌పీసీఎల్) 1 లాభం 30% పెరిగి రూ. 1,037.45 కోట్లకు చేరింది, ఇది బలమైన ఆపరేషనల్ ఎఫిషియన్సీని సూచిస్తుంది.

**టైటాన్ :** టైటాన్ కంపెనీ లాభం 50%కి పైగా పెరిగి, అంచనాలను అధిగమించింది, ఇది ఆభరణాల రంగంలో బలమైన డిమాండ్‌ను ప్రతిబింబిస్తుంది.

**నాల్కో :** నేషనల్ అల్యూమినియం కంపెనీ (నాల్కో) లాభం సగానికి తగ్గి, ఆదాయం 28% తగ్గింది, ఇది మెటల్స్ రంగంలో సవాళ్లను సూచిస్తుంది.

**సుంకాల ప్రభావం:** ఎగుమతులపై ఆందోళన : అమెరికా విధించిన 50% సుంకాలు భారత ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. టెక్స్‌టైల్స్ (34.5% ఎగుమతులు), సీఫుడ్ (రూ. 24,000 కోట్ల నష్టం అంచనా), రత్నాలు మరియు ఆభరణాలు, రసాయనాలు, ఆటో ఆంక్సిలరీలు వంటి రంగాలు అత్యధికంగా ప్రభావితమవుతున్నాయి. మోర్గాన్ స్టాన్లీ నివేదిక ప్రకారం, ఈ సుంకాల వల్ల భారత టెక్స్‌టైల్ ఎగుమతిదారులు బంగ్లాదేశ్, వియత్నాంతో పోటీలో వెనుకబడుతున్నారు, దీనివల్ల ఉపాధి నష్టాలు మరియు ఆర్థిక అనిశ్చితి పెరుగుతోంది. భారత ప్రభుత్వం ఈ సుంకాలకు ప్రతిస్పందనగా అమెరికాతో వాణిజ్య ఒప్పందాలను సమీక్షిస్తోంది. మూడు-దశల వ్యూహంతో ఎగుమతిదారులను రక్షించేందుకు చర్యలు తీసుకుంటోంది, అయితే కొత్త అమెరికా ఆయుధాలు మరియు విమానాల కొనుగోలు ప్రణాళికలను నిలిపివేసింది, ఇది ద్వైపాక్షిక సంబంధాలపై ఒత్తిడిని సూచిస్తుంది.

**ఐపీఓ మార్కెట్: కొత్త అవకాశాలు :** ఐపీఓ మార్కెట్ శుక్రవారం కూడా చురుకుగా ఉంది. రెనోల్ పాలీకెమ్ ఎన్ఎస్ఈ ఎస్ఎమ్ఈ ప్లాట్‌ఫామ్‌లో రూ. 25.77 కోట్ల ఐపీఓను ప్రారంభించింది, ఇది 6.83 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. సావలియా ఫుడ్స్ ప్రొడక్ట్స్ ఐపీఓ కూడా శుక్రవారం దృష్టిని ఆకర్షించింది, దీని జీఎంపీ మరియు ధర బ్యాండ్ వివరాలు ఆసక్తిని రేకెత్తించాయి. ఈ ఐపీఓలు చిన్న మరియు మధ్య తరహా సంస్థలకు నిధుల సేకరణకు కొత్త అవకాశాలను అందిస్తున్నాయి.

**రంగాల వారీగా సమీక్ష :**

**ఆటోమోటివ్ :** హ్యుందాయ్ మోటార్ ఇండియా తన మార్కెట్ వాటాను పెంచుకునేందుకు 26 కొత్త ఉత్పత్తులను విడుదల చేయనుంది, ఎస్‌యూవీలు మరియు ఎలక్ట్రిక్ వాహనాలపై దృష్టి సారిస్తోంది. అయితే, ఈవీ అడాప్షన్‌లో సవాళ్లు మరియు క్రెటా మోడల్‌పై ఆధారపడటం వంటి సమస్యలు ఉన్నాయి.

**-ఏవియేషన్ :** ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ బ్రాండింగ్‌తో ఎయిర్‌ఏషియా ఇండియా విమానాలు శుక్రవారం నుండి ఆపరేట్ అవుతున్నాయి, ఇది భారత ఏవియేషన్ మార్కెట్‌లో విలీన ప్రక్రియలో భాగం.

**బ్యాంకింగ్ :** ఆర్‌బీఎల్ బ్యాంక్ ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో వాటాను సముపార్జించేందుకు ఆర్‌బీఐ నుండి ఆమోదం పొందింది, ఇది బ్యాంకింగ్ రంగంలో విస్తరణకు సూచనగా ఉంది.

**ఆర్థిక వృద్ధి అంచనాలు :** అమెరికా సుంకాలు మరియు రష్యాతో ఇంధన వాణిజ్యం సంబంధించిన ఆంక్షల కారణంగా భారత ఆర్థిక వృద్ధి అంచనాలను ఫిచ్ రేటింగ్స్ సవరించింది. 2025 మరియు 2026లో ఆర్థిక వృద్ధి సవాళ్లను ఎదుర్కొనవచ్చని హెచ్చరించింది.

అయితే, దీర్ఘకాలిక దృష్టితో పెట్టుబడిదారులు నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటి రంగాలలో అవకాశాలను గుర్తిస్తున్నారు, ఇక్కడ విలువలు ఆకర్షణీయంగా ఉన్నాయని డిమెటర్ అడ్వైజర్స్ యొక్క అశ్విని అగర్వాల్ సూచించారు.

**ముగింపు :** ఆగస్టు 8, 2025 శుక్రవారం భారత వ్యాపార మరియు ఆర్థిక రంగంలో సవాళ్లు మరియు అవకాశాల మిశ్రమ రోజుగా నిలిచింది. అమెరికా సుంకాలు ఎగుమతులపై ఒత్తిడిని పెంచినప్పటికీ, దేశీయ కంపెనీలు బలమైన ఫలితాలతో స్థితిస్థాపకతను ప్రదర్శిస్తున్నాయి. ఐపీఓ మార్కెట్ చురుకుగా ఉండటం, బ్యాంకింగ్ మరియు ఆటోమోటివ్ రంగాలలో కొత్త పరిణామాలు భవిష్యత్తులో ఆశాజనక అవకాశాలను సూచిస్తున్నాయి. ఈ సందర్భంలో, పెట్టుబడిదారులు మరియు వ్యాపారవేత్తలు దీర్ఘకాలిక దృష్టితో వ్యవహరించడం కీలకం.

# టీటీడీ అనుబంధ ఆలయాలలో ఘనంగా సౌభాగ్యం



**తిరుపతి-పబ్లిక్‌టుడే:** టీటీడీ మరియు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆగష్టు 8వ తేదీ వరలక్ష్మీ వ్రతం సందర్భంగా 52 టిటిడి అనుబంధ ఆలయాలలో సౌభాగ్యం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సౌభాగ్యవతులకు గాజులు, పసుపు, కుంకుమ, అక్షింతలు, పుస్తక ప్రసాదాలు అందించారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలోని టీటీడీకి ఆలయాలలో సౌభాగ్యవతులకు గాజులు, కుంకుమ ప్యాకెట్లు, కంకణాలు, పసుపు దారాలు, శ్రీ పద్మావతీ అమ్మవారి లక్ష్మీ అష్టోత్తర శత నామావళి పుస్తక ప్రసాదాలను అందించారు. తిరుచానూరు, నారాయణవనం , శ్రీకాకుళం, కార్వేటినగరం, దేవుని కడప, ఒంటిమిట్ట, హైదరాబాద్, సీతంపేట, పిఠాపురం, కీలపట్ల, అనంతవరం, రాజాం, సరిమల్లె, అమరావతి, విజయవాడ తదితర 52 ఆలయాల్లో సౌభాగ్యం కార్యక్రమం కింద సౌభాగ్యవతులకు గాజులు, కుంకుమ, పసుపు దారాలు, కంఃణాలను స్థానిక అధికారులు, శ్రీవారి సేవకులు పంపిణీ చేశారు. దాతల సహకారంతో 8 లక్షల గాజులు, 1.60 లక్షల కంకణాలు, 1.60 లక్షల పసుపు దారాలు, 1.60 లక్షల అమ్మవారి కుంకుమ ప్యాకెట్లు, అమ్మవారి లక్ష్మీ అష్టోత్తర శత నామావళి పుస్తక ప్రసాదాలను అందించారు. ఆయా ఆలయాలకు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





